VISION BHARATH REPORTER
విభారె
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న "విభారె" తెలుగు దిన పత్రికకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా
అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్.
MOBILE: 9494498787,9440232308.

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
ఠి.నెం. 119/2015
ఆళ్లగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 27-07-2023 సంపుటి : 04 సంచిక : 285 పేజీలు : 8 వెల : రూ 3-00

# ఆంధ్రలో భారీ వర్షాలు

## ఏపీలోని నాలుగు జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ.



అమరావతి, జులై 26 : ఉత్తరాంధ్ర – దక్షిణ ఒడిశా తీరంలో బలపడిన అల్పపీడనం. వాయుగుం డంగా మారే అవకాశంఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇది నెమ్మదిగా వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉంది. దీని ప్రభావంతో ఏపీలో మరో మూడు రోజులు విస్తారంగా వర్షాలు. పడనున్నాయని ఐఎండి పేర్కొంది. శ్రీకాకుళం, మన్యం, విజయనగరం, అల్లూరి జిల్లాలకు రెడ్ అలెర్ట్ ప్రకటించారు. రానున్న 48 గంటల పాటు భారీ నుండి అతిభారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక జారీ అయ్యింది. మిగిలిన జిల్లాలో రానున్న రెండు రోజులు మోస్తారు నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయ ంటున్న వాతావరణ శాఖ వెల్లడించింది. ఇటు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఏలూరుజిల్లా పెదవేగి మండలం కూచింపూడి గ్రామం లో రిలయన్స్ సెల్ టవర్ ప్రాంతం లో ఉన్న ఇందిరమ్మ కాలనీ నీట మునిగిం ది. ఈ కాలనీ లోతట్టు ప్రాంతంగా ఉండటం తో వరద నీరు ఇళ్లలోకి చేరడం తో ప్రజలు తమ ఇళ్లలోకి చేరిన నీటిని బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని ఇందిరమ్మ కాలనీ ప్రజలు అధికారులను కోరుతున్నారు. మరోపక్క ఏలూరు సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో వర్షపునీరు చేరడంతో తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనములు నీట మునిగాయి. ప్రభుత్వ ఆసుపత్రి సంబంధిత అధికారులు ముందుగా తగు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఆసుపత్రిలో పలు వార్డుల్లోకి నీరు చేరింది. ఆరోగ్యం బాగోలేక ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వస్తే, వార్డులో నిలిచిన నీరు వల్ల కొత్త రోగాలు వస్తాయని రోగులు, భయభ్రాంతులకు గురవుతున్నారు. కామవరపు కోటమండలం కళ్ళచెరువు. లింగపాలెం మండలం ఆసన్నగూడెం గ్రామాలను కలిపే గుండేరు వాగు దాటడానికి తాత్కాలికంగా నిర్మించిన రహదారి వాగు ఉధృతి కొట్టుకుపోయింది. ఈ వాగుపై 100 ఎల్లనాడు నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరి గత 5 ఏళ్ళనాడే కుంగిపోయింది. ఈ వంతెన పై నుండి వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి. ప్రజల ప్రయాణాలు దృష్టిలో పెట్టుకుని కుంగిపోయిన వంతెన ప్రక్కనే తాత్కాలిక రహదారిని నిర్మించారు.

# ఐటీపీఓలో మోదీ పూజలు.. శ్రమ జీవులకు సన్మానం




దిల్లీ: ప్రతిష్ఠాత్మక 'జీ-20' శిఖరాగ్ర సదస్సుకు భారత్ సిద్ధమవుతోంది. దిల్లీ వేదికగా సెప్టెంబరులో జరగనున్న ఈ సమావేశానికి దేశాధినేతలు, పెద్దఎత్తున విదేశీ ప్రతినిధులు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లలో ప్రభుత్వం నిమగ్నమైంది. ఈ క్రమంలోనే ప్రధాన వేదిక అయిన 'ఐటీపీఓ కాంప్లెక్స్'ను ఆధునికీకరించింది. దీని ప్రారంభంలో భాగంగా ప్రధాన మోదీ పూజలు నిర్వహించారు. అలాగే ఈ ఆధునికీకరణ ప్రక్రియలో భాగమైన శ్రమ జీవులతో మాట్లాడారు. వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు కూడా పాల్గొన్నారు. ఈ ఐటీపీఓనే ప్రగతి మైదాన్ అని కూడా పిలుస్తారు. ఈ ప్రగతి మైదాన్ దాదాపు 123 ఎకరాల్లో విస్తరించి ఉంది. దేశంలోనే అతిపెద్ద సమావేశ సముదాయం ఇది. ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్, కన్వెన్షన్ సెంటర్ (ఐఈసీసీ) ఇందులో ప్రధానం. కార్యక్రమాల నిర్వహణకు అందుబాటులో ఉన్న స్థలం విషయంలో ప్రపంచ స్థాయి టాప్-10 ఐఈసీసీల్లో ఇదీ ఒకటి. దీని లెవల్-3లో ఏడు వేల మందితో భారీ సిటింగ్ సామర్థ్యం ఉంది. మూడు వేల మంది కూర్చునేలా ఓ యాంఫీథియేటర్ నిర్మించారు. 5500కుపైగా వాహనాలు పార్క్ చేసుకోవచ్చు. భారతీయ వైభవం, ఆధునికతలను మేళవించి దీనిని నిర్మించారు.

# ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం

## నోటీసులు అందించిన కాంగ్రెస్, బీఆర్ఎస్

## తీర్మానాన్ని ఆమోదించిన లోక్‌సభ స్పీకర్

న్యూఢిల్లీ, జూలై 26: మణిపూర్ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం పెట్టాలని కోరుతూ కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) బుధవారం నోటీసులు సమర్పించాయి. ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని లోక్‌సభ స్పీకర్



ఓం బిర్లా ఆమోదించారు. స్పీకర్ ఇప్పుడు చర్చ తేదీని త్వరలో ప్రకటిస్తారు. లోక్‌సభలో కాంగ్రెస్ డిప్యూటీ లీడర్ గౌరవ్ గొగోయ్ లోక్‌సభ సెక్రటరీ జనరల్ కార్యాలయానికి నోటీసు ఇచ్చారు. అవిశ్వాస తీర్మానం కోసం ప్రత్యేక నోటీసును భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఫ్లోర్ లీడర్ నాగేశ్వర్ రావు స్పీకర్‌కు సమర్పించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నేతృత్వంలో బీఆర్ఎస్ ఉన్న సంగతి తెలిసిందే. అవిశ్వాస తీర్మానం సభా వేదికపై ప్రభుత్వ మెజారిటీని సవాలు చేయడానికి ప్రతిపక్షాన్ని అనుమతిస్తుంది. తీర్మానం ఆమోదించ బడితే, ప్రభుత్వం రాజీనామా చేయాల్సి ఉంటుంది. మణిపూర్‌లో జరిగిన హింసాకాండను ఉపయోగించి బీజేపీ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయి. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజు నుంచి మణిపూర్‌లో జరిగిన హింసాకాండపై ప్రధాని మోడీ మాట్లాడాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జూలై 20న ప్రారంభమయ్యాయి.

# బీజేపీ, జనసేన పొత్తు కొనసాగుతుంది

## ఉమ్మడి సీఎం అభ్యర్థిపై వారిదే నిర్ణయం

## ఏపీ బీజేపీ చీఫ్ దగ్గుబాటి పురందేశ్వరి

అమరావతి, జూలై26 : బీజేపీ, జనసేన పొత్తు కొనసాగుతుందని ఏపీ బీజేపీ చీఫ్ దగ్గుబాటి పురందేశ్వరి మరోసారి స్పష్టం చేశారు. రాజమండ్రిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జనసేనతో పొత్తు ఇవాళే కాదు, రేపు కూడా ఉంటుందని తేల్చి చెప్పారు. అయితే.. మిగిలిన పార్టీలతో పొత్తుపై కేంద్ర నాయకత్వం నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. బీజేపీ, జనసేన ఉమ్మడి సీఎం అభ్యర్థిని కేంద్ర కమిటీ నిర్ణయిస్తుందన్నారు. పార్టీ అధిష్టానం ఎక్కడి నుంచి పోటీ చేయమంటే.. అక్కడి నుంచే తాను పోటీ చేస్తానని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజా సమస్యలపై పోరాటం చేయడమే తమ లక్ష్యమని వెల్లడించారు. కేంద్రం ఇస్తున్న నిధులను ఏపీ ప్రభుత్వం దారి మళ్లిస్తోందని.. పంచాయతీల పరిస్థితే అందుకు ఉదాహరణ అని పురందేశ్వరి ఆరోపించారు. కేంద్రం ఇచ్చిన నిధులు ఏమయ్యాయో వైసీపీ ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. పంచాయతీలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. తాను పార్టీ అధ్యక్షురాలిని అయ్యాక మొదట రాష్ట్రంలో పంచాయతీల అంశాన్ని తీసుకున్నానని అన్నారు. నిధుల దారి మళ్లింపుపై సర్పంచ్‌లు పార్టీలకతీతంగా తమ మద్దతు కోరారని.. ఏపీ బీజేపీ వారికి పూర్తి మద్దతు అందిస్తుందని భరోసా కల్పించారు. గోదావరి జిల్లాలకు, రాష్ట్రానికి కేంద్రం పలు సంస్థలు కేటాయించిందన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఆవ భూముల్లో అవకతవకలకు పాల్పడ్డారని.. మడ అడవులని నరికించేశారని పురందేశ్వరి మండిపడ్డారు. రాష్ట్రంలో మట్టి మాఫియా, ఇసుక మాఫియా చెలరేగిపోతోందని ఆరోపణలు చేశారు. చిన్న కాంట్రాక్టర్లు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్ పనులు నత్తనడకన సాగడానికి రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను ఏమాత్రం కేటాయించడం లేదని వ్యాఖ్యానించారు. ఆగస్టు 15వ తేదీన సర్పంచుల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు పురందేశ్వరి పిలుపునిచ్చారు.



# అడువులనుండి ఆదివాసులను దూరం చేయడమే బీజేపీ లక్ష్యం

## సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

## మణిపూర్ ఘటనను నిరసిస్తూ రాజమండ్రిలో సిపిఐ నిరసన




రాజమండ్రి , జులై 26 మణిపూర్ సీఎం రాజీనామా చేయాలని , బీజేపీ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలనీ మణిపూర్ అత్యాచారం , హింస ఘటనను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక శ్యామల సెంటర్ వద్ద పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేసారు . దేశంలో ఆడ బిడ్డలకు రక్షణ కల్పించాలని , బీజేపీ ప్రభుత్వాన్ని రద్దు చేయాలనీ , హిందూ మతోన్మాదం నశించాలని అంటూ నినాదాలు ఇచ్చారుఅ నంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ మణిపూర్ లో జరుగుతున్న హింసాత్మక ఘటనలు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయని దీని వెంటనే ఆపి అక్కడ శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కుకీ తెగకు చెందిన ఆదివాసీ మహిళలను ఇద్దర్నీ నగ్నంగా ఊరేగించి సామూహిక లైంగిక దాడి హత్య చేయడం సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నదని పేర్కొన్నారు. దీన్ని ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించాలని అక్కడి ప్రజలకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. మణిపూర్ జనాభా లో 54 శాతానికి పైగా ఉన్న మైతి తెగలు కుకీ ,నాగ గిరిజన తెగల మధ్య బిజెపి తన రాజకీయ లబ్ధి కోసం చిచ్చు పెడుతుందని విమర్శించారు. గిరిజన చట్టాలను అతిక్రమించి మైథిలను గిరిజనులుగా మార్చడానికి ఒడిగట్టిందని తెలిపారు. ఆదివాసీలను అడవుల నుంచి దూరం చేస్తున్నదని పేర్కొన్నారు. దీన్ని ప్రతిఘటించిన కుకీ,నాగ తెగలపై మతోన్మాద శక్తులు బిజెపి అండతో రెండున్నర నెలలుగా తీర్వమైన దాడులకు దిగబడుతున్నాయని అన్నారు. గృహ దహనాలు చర్చిల తో పాటు ఆస్తులను ధ్వంసం చేస్తున్నాయని తెలిపారు. ఈ హింసాత్మక ఘటనలకు కేంద్ర ప్రభుత్వం మణిపూర్ రాష్ట్ర బిజెపి ప్రభుత్వాలు బాధ్యత వహించి రాజీనామా చేయాలని దోషులను వెంటనే శిక్షించాలని బాధితుల కు న్యాయం చేయాలని అక్కడ శాంతి యుత వాతావరణం నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కుంద్రపు రాంబాబు , నగర కార్యదర్శి వి కొండలరావు , సహాయ కార్యదర్శి సప్పా రమణ , జట్ల సంఘము అధికారబడి సభ్యులు పి దేముడు , వెంకటరావు , కె అప్పల నాయుడు, నల్ల రామారావు,ఏ ఐ వై ఫ్ జిల్లా కన్వీనర్ కె శ్రీనివాస్ , ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులూ కొండలరావు , నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు

# సీమకు తీరని ద్రోహం.. ఆ పాపం జగన్‌దే: చంద్రబాబు

మంగళగిరి: ఏపీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి అజ్ఞానం, మూర్ఖత్వంతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని తెదేపా అధినేత చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సాగునీటి ప్రాజెక్టులే ఓ ఉదాహరణ అని చెప్పారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సాగునీటి ప్రాజెక్టులు నాశనమైన తీరున ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. "రాయలసీమ రాళ్ల సీమ కాకూడదంటూ తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి ఊపిరి పోసిన వ్యక్తి ఎన్టీఆర్. దేశంలో ఏ రాష్ట్రానికీ లేని



నదీవనరులు మనకు ఉన్నాయి. నదులు అనుసంధానం చేస్తే ప్రతి ఎకరాకు నీరు ఇవ్వొచ్చు. నీటిపారుదలశాఖను నాశనం చేసిన జగన్ సమాధానం చెప్పాలి. సీమకు తీరని ద్రోహం చేసిన పాపం జగన్‌దే" అని చంద్రబాబు మండిపడ్డారు.

# దొంగ ఓట్ల చరిత్ర చంద్రబాబుది: మంత్రి పెద్దిరెడ్డి



చిత్తూరు: దొంగ ఓట్లతోనే కుప్పంలో చంద్రబాబు గెలుస్తూ వస్తున్నాడని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. కుప్పంలో ఇప్పటికీ దొంగ ఓట్లు ఉన్నాయని, దొంగ ఓట్లను తొలగించి ఎన్నికల కమిషన్ ప్రక్షాళన చేస్తుందని ఆయన పేర్కొన్నారు. దొంగ ఓట్ల చరిత్ర చంద్రబాబుదని.. 2019కి ముందు రాష్ట్రంలో 60 లక్షల దొంగ ఓట్లను నమోదు చేయించారు.. ఇప్పుడు చంద్రబాబు తీరు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని మంత్రి దుయ్యబట్టారు. వైఎస్సార్ జిల్లా: వ్యవసాయం దండగ అన్న వ్యక్తి చంద్రబాబు అని, ఆయన పాలనలో ఒక్క ప్రాజెక్టయినా రూపకల్పన చేశారా? అంటూ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, "ఉమ్మడి రాష్ట్రంలో రైతులకు నీళ్లు అందించిన గొప్ప నేత వైఎస్సార్. ద్వేషంతో రాయలసీమకు చంద్రబాబు అన్యాయం చేశారు. పోతిరెడ్డిపాడును వ్యతిరేకిస్తూ ధర్నా చేయించిన వ్యక్తి చంద్రబాబు.

# సంపాదకీయం

**గురువారం 27-07-2023**

## దేశ హితం కోసమే ఉమ్మడి పౌరస్మృతి !

ఉమ్మడి పౌరస్మృతి అనగానే రాజకీయపార్టీలు, మత ఛాందసవాదులు గొంతు చించుకోవడం అలవాటు చేసుకున్నారు. ప్రజలందరి రక్తం ఒక్కటే అంటున్న కమ్యూనిస్టులు సైతం ద్వంద్వ నీతిని అవలంబి స్తున్నారు. దురాచారాలను అణచివేసే క్రమంలో ఒక్కో మెట్టు ఎక్కుతూ వస్తున్న భారత్‌లో ఉమ్మడి పౌరస్మృతి ఓ ఆవశ్యకతగా గుర్తించాలి. గతంలో ఎన్నో దురాచారాలను మనం రూపు మాపుకున్నాం. బాల్య వివాహాలను రద్దు చేశాం. సతీసహగమనాన్ని రద్దు చేశాం. అలాగే అనేక మార్పులకు ప్రపంచం లోనవు తున్న వేళ ప్రజలకు చట్టం అన్నది ఒకే రకంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఉమ్మడి పౌరస్మృతి అంటే మతపరమైన అచారాలు, సంప్రదాయాలకు అతీతంగా భారత భూభాగం పరిధిలో ఉన్న పౌరులందరికీ ఒకే చట్టాన్ని వర్తింపజేయడం. ఈ దేశంలో పెళ్లిళ్లు, విడాకులు, వారసత్వంగా వచ్చే ఆస్తులు, పిల్లలను దత్తత తీసుకోవడం, జీవన భృతి లాంటి విషయాలకు సంబంధించి చట్టాలు అందరికీ ఒకేలా లేవు. పౌరులు ఆచరించే మతం, విశ్వాసాల ఆధారంగా వేర్వేరుగా ఉంది. అయితే మతంతో సంబంధం లేకుండా, లింగ భేదాల్లేకుండా భారత పౌరులందరికీ ఒకే చట్టం వర్తింపజేయడమే యూనిఫాం సివిల్ కోడ్. ఈ డిమాండ్ దేశానికి స్వాతంత్ర్యం÷-ర వచ్చిన నాటి నుంచే ఉంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 కూడా ఇదే చెబుతోంది. దేశ పౌరులకు యూనిఫామ్ సివిల్ కోడ్ తీసుకొచ్చేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలంటూ ఆదేశిక సూత్రాల రూపంలో రాజ్యాంగం సూచిస్తోంది. ఇప్పటి వరకు దేశంలో ప్రజాచట్టాలకు భిన్నంగా మతపరమైన చట్టాలున్నాయి. హిందూ వివాహ, వారసత్వ చట్టాలు, షరియా లాంటి ముస్లిం పర్సనల్ చట్టాలు అమలవుతున్నాయి. అయితే ఉమ్మడి పౌరస్మృతిలో ఎవరికి వాళ్లుగా అమలు చేసుకునే చట్టాలు చెల్లవు. దాంతో చాలా కాలంగా దేశంలో మైనారిటీ అయిన ముస్లింలు యూనిఫావ్ సివిల్ కోడ్‌ని వ్యతిరేకిస్తూ వచ్చారు. ఇప్పుడు మళ్లీ ఉమ్మడి పౌరస్మృతి అంశంపై చర్చ మొదలయ్యింది. 2019లో ట్రిపుల్ తలాక్‌ని నేరంగా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం చట్టం చేసింది. యూనిఫామ్ సివిల్ కోడ్ వచ్చే దాకా దేశంలో లింగ సమానత్వం సాధ్యం కాదనే వాదనలున్నాయి. ఉమ్మడి పౌరస్మృతి వల్ల దేశంలో సమానత్వం లభిస్తుంది. కొత్త సమస్యలు పుట్టుకొస్తాయని చెబుతున్న వారంతా కేవలం ఓటు బ్యాంక్ రాజకీయ ప్రయోజనాలు ఆశించేవారుగానే చూడాలి. పౌరులు తమకు నచ్చిన మతాన్ని స్వీకరించేందుకు, అనుసరించేందుకు, వ్యాప్తి చేసేందుకు వీలుంది. దీనిని ఎవరూ కాదనడం లేదు. చట్టం విషయంలోనే మతాల ఆధారంగా ఉండరాదన్నది ఆకాంక్ష. అయితే భిన్న మతాలు, నమ్మకాలున్న భారత్ లాంటి పెద్ద దేశాల్లో ఉమ్మడి సివిల్ కోడ్స్ ద్వారా అందరినీ ఏకం చేయడమనేది ఎంతో కష్టమైన విషయం అన్న వాదన తెస్తున్నారు కొందరు. హిందువులైనా, ముస్లింలైనా వాళ్లలో వాళ్లకు అనేక భిన్నమైన నమ్మకాలు, విశ్వాసాలు ఉంటాయి. అవి వేరు..చట్టాలు వేరని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. మిందువుల్లోనూ భిన్న ఆచారాలు, సంప్రదాయాలు పాటించే వాళ్లున్నారు. ముస్లింలలోనూ షరియా చట్టాలను పాటించని వాళ్లున్నారు. బోరా ముస్లింలు ఆస్తుల వారసత్వం విషయంలో హిందువుల చట్టాలను అనుసరిస్తుంటారు. ఆస్తుల వారసత్వం విషయంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా చట్టాలున్నాయి. ఇక క్రైస్తవులు మెజారిటీగా ఉండే నాగాలాండ్, మిజోరం లాంటి రాష్ట్రాలు తమకంటూ ప్రత్యేకమైన సివిల్ చట్టాలను రూపొందించుకున్నాయి. వాటికి ఆధారం వారి సంప్రదాయాలే గానీ మతం కాదు. గోవాలో 1867 నాటి కామన్ సివిల్ కోడ్ అమల్లో ఉంది. కానీ క్యాథలిక్స్, ఇతర మతస్థులకు భిన్నమైన నియమాలున్నాయి. భారత్‌లో పౌర స్మృతులు ఉమ్మడి జాబితాలో ఉన్నాయి. హిందువుల్లో కొడుకులతో సమానంగా కూతుళ్లకు వారసత్వ ఆస్తిలో వాటా పొందేలా 2005లో చట్టాలను సవరించారు. కానీ దీని కంటే ముందే పలు రాష్ట్రాలు మహిళలకు వారసత్వ ఆస్తిలో వాటా హక్కును కల్పిస్తూ చట్టాలు చేశాయి. ఇలా రాష్ట్రానికో చట్టం, మతానికో చట్టం,ప్రాంతానికో చట్టం ఉండడం వల్ల గందరగోళంగా ఉంది. దీనిని తొలగిస్తే తప్ప దేశంలో ఏకీకరణ సాధ్యం కాదు. ప్రజల్లో ఐక్యత రాదు. ఉమ్మడి పౌరస్మృతి తమ మతంపై, సంస్కృతిపై దాడి అని ముస్లింలు సహా మిగతా మైనారిటీ వర్గాలు చేస్తున్న వాదనలో నిజం లేదు. ఎందకంటే మతం ఆధారంగా చట్టాలు చేస్తూ పోతే ఇప్పటికే దేశం కులాలు, మతాలు, ప్రాంతాలుగా విభజింపబడింది. మతం లాంటి వ్యక్తిగత విషయాల్లో ప్రభుత్వ జోక్యం చేసుకోవాలని ప్రభుత్వం కూడా భావించడం లేదు. గడిచిన 40 ఏళ్లలో భిన్న తీర్పుల్లో భాగంగా దేశ సమైక్యత కోసం యూనిఫామ్ సివిల్ కోడ్ తీసుకు రావాలని సుప్రీం కోర్టు ప్రభుత్వాలకు సూచిస్తూ వచ్చింది. డెబ్బయి అయిదేండ్ల స్వాతంత్ర్యంలో ఆర్థిక అసమానతలు అంతరించకపోగా పెరిగాయి. సామాజిక అసమానతలు అలానే ఉన్నాయి! స్త్రీలను ఇంకా విలాసవస్తువుగానే చూస్తున్నారు. వారికి గౌరవం దక్కడం లేదు. ఉండటానికి కూడు, గుడ్డ, నీడ సమకూర్చనేలేదు. ఉమ్మడి పౌరస్మృతి అనగానే మతపరమైన అంశమని, అదీ మన ప్రత్యర్థి మతాన్ని నియంత్రించేదన్న ప్రచారం వాడుకలోకి తెచ్చారు. కానీ ఇది అన్ని మతాలకూ, అందరు ప్రజలకూ సంబంధించినది. అందుకనే చాలా జాగ్రత్తగా ఆలోచన చేయాలి. అందరూ సమానంగా వ్యవహరించటానికి మన రాజ్యాంగమూ అందరికీ అన్ని హక్కులనూ కల్పిస్తున్నది. అలాంటప్పుడు చట్టాలు అందరికీ ఒకేలా కాకుండా కొందరికి మరోలా ఉండడం వల్ల సమాజంలో అసమానతలు ప్రబలుతాయి. మీ చట్టం మాకు చెల్లదని ధిక్కరించే సంస్కృతి వస్తుంది. దీనిని అధిగమించి ప్రజలంతా ఒక్కటే..అందరికీ ఒకటే చట్టం అన్న భావన ఉంటే సమానభావం అలవడుతుంది. అందుకు ఉమ్మడి పౌరస్మృతి అవసరమే.

## దేశంలో మహిళలకు రక్షణ లేదు.

### మోడీ వెంటనే రాజీనామా చేయాలి.

### డిసిసి అధ్యక్షులు సుధాకర్ బాబు డిమాండ్.



కర్నూలు జూలై 26 విభారె న్యూస్.భారత దేశంలో మహిళలకు రక్షణ కరువైందని,వెంటనే ప్రధాని మోదీ తన పదవికి రాజీనామా చేయాలని కర్నూల్ డిసిసి అధ్యక్షులు సుధాకర్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం కర్నూల్ సిటీ మహిళా విభాగం అధ్యక్షరాలు శ్రీమతి ప్రమీల ఆధ్వర్యంలో 352 మంది మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. భారీ వర్షం పడుతున్న మహిళలు వందలాదిమంది కాంగ్రెస్ పార్టీ కార్యాలయంకు చేరుకున్నారు పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో డిసిసి అధ్యక్షులు సుధాకర్ బాబు మాట్లాడుతూ మణిపూర్ లో జరిగిన సంఘటన విషయంలో పార్లమెంటులో ప్రతిపక్షాలు మణిపూర్ అంశంపై చర్చించాలని డిమాండ్ చేస్తుంటే, నోరు మెదపకుండా మౌనంగా ఉండటం సిగ్గుచేటు అన్నారు. పార్లమెంట్ సమావేశాలు అంటే మోడీకి లెక్కలేదని,ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక తనదైన శైలిలో ప్రజలను మభ్యపెట్టి తిరిగి అధికారంలో వచ్చేందుకు ప్రయత్నించడం మానుకోవాలన్నారు. అల్లర్లపై అట్టడుగు పోతుంది మణిపూర్ అల్లర్లపై చర్చలు జరగాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న ప్రతిపక్షాల డిమాండ్ లెక్క చేయడం లేదని ఆయన విమర్శించారు.జాతుల మధ్య విభేదాలు సృష్టించడం మణిపూర్ సంఘటనపై సుప్రీంకోర్టు వ్యాఖ్యానించే వరకు మహిళలపై జరుగుతున్న నేరాలపై ఆయన మౌనం గానే ఉన్నారని ఎద్దేవా చేశారు. మణిపూర్ లో మహిళలను నగ్నంగా ఊరేగించిన సంఘటన 140 కోట్ల మంది భారీతీయులను తలదించుకునేలా ఉందని దేశ ప్రధానిగా ఉండటానికి మోడీ అనర్హుడని, కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా కూడా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.కర్నూలు జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి కొత్తూరు సత్యనారాయణ గుప్తా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హాయంలో జరిగిన అభివృద్ధిని చూడాలని ,దేశ స్వాతంత్రం తీసుకొచ్చిన పార్టీ కాంగ్రెన్ పార్టీ అని ఆయన తెలిపారు.గ్యాన్ ధరలు పెరిగిపోవడం,నిత్యావసర సరుకుల ధరలు సామాన్యులకు అందుబాటులో లేదని, తిరిగి ఇందిరమ్మ పాలన కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు.సకాలంలో ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడం వల్ల వర్షపు నీటిని బంధించలేక సముద్రపాలవుతున్నాయన్నారు.దేశంలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని, మాటలెక్కువ చేతుల్లో తక్కువని అన్నారు.ఇచ్చిన హామీలు అమలు పరచడంలో జగన్మోహన్ రెడ్డి మడమ తిప్పాడని ఆయన విమర్శించారు. ప్రత్యేక హోదా తెస్తా కేంద్ర మెడలు వంచుతా అని చెప్పిన జగన్ ప్రభుత్వం ఎందుకు ప్రత్యేక హోదా తీసుకురాలేకపోతున్నారని ఆయన ప్రశ్నించారు. రాహుల్ గాంధీ చేపట్టిన జోడోయాత్రతో దేశమంతా ఏకమై బిజెపి ప్రభుత్వాన్ని కూలగొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు.నగర మహిళా విభాగం అధ్యక్షురాలు ప్రమీల మాట్లాడుతూ మణిపూర్ సంఘటన స్త్రీ జాతికి కళంకమని మహిళలకు రక్షణ లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు ఎటువంటి పాలకులను ప్రజలు ఓడించాలని ఆమె స్పష్టం చేశారు. కర్నూల్ జిల్లా కాంగ్రెస్ మహిళ విభాగం సేవదల్ అధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ మహిళలు బయటకు వెళ్లేందుకు కూడా భయపడాల్సిన దుస్థితి భారతదేశంలో కలగడం బాధాకర విషయం అన్నారు మహిళల మానప్రాణాలకు రక్షణ కరువైందని దేశ సమైక్యత కోసం పాటుపడే పార్టీ కాంగ్రెస్ పార్టీని ఆమె కొనియాడారు.ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి కే సత్యనారాయణ గుప్త ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్ సి హెచ్ బజారన్న మైనారిటీ సెల్ సిటీ అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్ మహిళా కాంగ్రెస్ సిటీ అధ్యక్షురాలు ఎస్ ప్రమీల సేవాదళ్ జిల్లా అధ్యక్షురాలు ఏ వెంకట సుజాత సేవాదళ్ సిటీ అధ్యక్షురాలు పి రాధిక మొదలగు వారు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండండి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామున్

నంద్యాల మా ప్రతినిధి జూలై 26 విభారె న్యూస్ :-బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన కారణంగా తుఫాన్ ప్రభావ నేపథ్యంలో భారీ వర్షాల వల్ల ప్రజలను అప్రమత్తం చేసేందుకు అధికారులందరూ సిద్ధంగా ఉండాలని సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల వల్ల జిల్లాను రెడ్ అలెర్ట్ గా ప్రకటించిన నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు అందుబాటులో ఉండి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఇరిగేషన్, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, వ్యవసాయ అధికారులు, ఆర్డీఓలు, తాశీల్దార్లు, ఎంపీడీఓలు, తదితర మండల గ్రామస్థాయి అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండి అధిక వర్షాల వల్ల ప్రజలు ప్రమాద బారిన పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. వాగులు, వంకలు, నదులకు గండ్లు పడకుండా పరివాహక ప్రాంతాలలో పర్యటించి ఎప్పటికప్పుడు తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేరేవేసేందుకు సంబంధిత మండల తాసిల్దారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.కలెక్టరేట్ లోని కంట్రోల్ రూమ్ నెం. 08514 - 294898తుఫాన్ ప్రభావిత కారణంగా ఏదైనా సమాచారం కొరకు జిల్లా కలెక్టరేట్ లో 24/7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ తెలిపారు. ప్రజలు ఏదేని సమాచారం కొరకు కంట్రోల్ రూమ్ నెం. 08514 - 294898 కు ఫోన్ చేసి సంప్రదించవచ్చన్నారు. కంట్రోల్ రూమ్ ఈనెల 26 నుండి 28వ తేదీ వరకు 24 గంటల పాటు నిరంతరాయంగా పనిచేస్తుందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఆగస్టు 15 నుండి అన్ని గ్రామ పంచాయతీలలో నగదు రహిత

నంద్యాల మా ప్రతినిధి జూలై 26 విభారె న్యూస్ :-జిల్లాలోని 489 గ్రామ పంచాయతీలలో వచ్చే నెల 15వ తేదీ నుండి నగదు రహిత ఆధారిత చెల్లింపుల ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి ఎస్. మంజులవాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సూచనల మేరకు ఆగస్టు 15వ తేదీ నుండి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో మొబైల్ ద్వారా క్యూఆర్ కోడ్ తో నగదు చెల్లించే ప్రక్రియ ప్రారంభం కానుందన్నారు. గ్రామ పంచాయతీలలో ప్రజల నుండి వసూలు చేయు పన్నులు, చెల్లింపులు నగదు రహిత ఆధారిత ప్రక్రియ ద్వారా స్వీకరించడం, చెల్లింపులు చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించి సహకరించగలరని ఆమె ప్రకటనలో పేర్కొన్నారు.

## ఈడీ చీఫ్ పదవిని పొడిగించాలి

### సుప్రీంను ఆశ్రయించిన కేంద్రం

న్యూఢిల్లీ,జూలై26: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ డైరెక్టర్ సంజయ్ కుమార్ మిశ్రా పదవీకాలాన్ని పొడిగించాలని కోరుతూ కేంద్రం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై సుప్రీంకోర్టు జులై 27న విచారణ చేపట్టనుంది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. ఈడీ డైరెక్టర్‌గా ఎస్‌కే మిశ్రా పదవీకాలం జులై 31తో ముగియనుంది. ఇండియన్ రెవెన్యూ సర్వీస్‌లో విశిష్ట అధికారి అయిన సంజయ్ కుమార్ మిశ్రా 1984 బ్యాచ్‌కి చెందినవారు. ఆర్థిక విషయాలలో తన నైపుణ్యాన్ని ప్రదర్శించిన మిశ్రా అక్టోబర్ 2018 నుండి మూడు నెలల పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (%జుణ%) తాత్కాలిక డైరెక్టర్‌గా పనిచేశారు. ఆయన అసాధారణమైన పరిశోధనా నైపుణ్యాలు, ముఖ్యమైన ఆదాయపు పన్ను కేసులను నిర్వహించడంలో విశేషమైన విజయాల కారణంగా ఈడీ శాశ్వత చీఫ్‌గా నియమించబడ్డారు. ప్రస్తుతం పలు హై ప్రొఫైల్ కేసుల దర్యాప్తులో మిశ్రా కీలక పాత్ర పోషించారని సీఎన్‌బీసీ నివేదించింది.

## జగనన్న సురక్ష పథకంతో ప్రజలకు మెరుగైన సేవలు.

--వెంకట దాస్ అసిస్టెంట్ కమిషనర్



నంద్యాల మా ప్రతినిధి జూలై 26 విభారె న్యూస్ :-జగనన్న సురక్ష పథకంతోనే ప్రజలు మెరుగైన సేవలు పొందే అవకాశం ఉందని నంద్యాల అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ వెంకట దాస్ పేర్కొన్నారు. 32 వ వార్డు ఉడుమార్పురం పరిధిలోని జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సచివాలయ యందు బుధవారం నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్లెల విజయ భాస్కర్ రెడ్డి. బొమ్మను మురళి ధర్ రెడ్డి. పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అన్ని రకాల సేవలు అందుబాటులోకి రావడంతో, మంచి జరుగుతుందన్నారు. . ఒక పైసా కూడా ఖర్చు లేకుండా ఉచితంగానే జగనన్న సురక్షలో ప్రజలు వివిధ రకాలైన సేవలు పొందే అవకాశం ఉందన్నారు. . ప్రతి ఒక్కరూ జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. 1006 వివిధ రకాల సర్టిఫికెట్లు కోసం అప్లై చేసారని ఈ రోజు 856 సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ . అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ . టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహ మూర్తి. వైయస్ ఆర్ పార్టీ కౌన్సిలర్లు మున్సిపల్ సిబ్బంది. సచివాలయ సిబ్బంది అభిద్. మోహన్ ద్రోనేశ్వర్. . వైసీపీ నేతలు గ్రుహ సారథులు. వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో మేడికో యువతి ఆత్మహత్య



శ్రీశైలం ప్రాజెక్టు (శ్రీశైలం) జూలై 26 విభారె న్యూస్.శ్రీశైలంలో మంగళవారం రాత్రి ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది.ఆత్మహత్యకు పాల్పడిన యువతి శ్రీశైలం ట్రాన్స్ కో ఏఈ సత్యనారాయణ కుమార్తె ఎన్.ధరణి (23) బెంగళూరు మై స్టోన్ యూనివర్సిటీలో మెడిసిన్ మొదటి సంవత్సరం చదువుతుంది.ఇటీవల కాలంలో పరీక్షలు పూర్తి చేసుకుని ఇంటికి వచ్చినట్లు యువతీ తల్లిదండ్రులు తెలిపారు. అయితే రెండు రోజుల క్రితం విడుదల అయిన మెడిసిన్ ఫస్ట్ ఇయర్ పరీక్ష ఫలితాలలో ఒక సబ్జెక్ట్ ఫెయిల్ కావడం తెలుసుకున్న యువతి తీవ్ర మనస్థాపానికి గురై రాత్రి సమయంలో ఇంట్లో ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు యువతీ తల్లిదండ్రులు తెలిపారు. ఉదయం లేవగానే ఫ్యాన్ కు వేలాడుతున్న యువతని చూసిన తల్లిదండ్రులు హుటాహుటిన దేవస్థానం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. యువతీ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు శ్రీశైలం పోలీసులు తెలిపారు.

## త్రాగునీటిని కాచి చల్లార్చి తాగాలి.

### - మున్సిపల్ కమిషనర్ ఎన్ గంగిరెడ్డి వెల్లడి.

ఎమ్మిగనూరు జూలై 26 విభారె న్యూస్.పట్టణ ప్రజలు త్రాగునీటిని కాచి వడబోసి తాగవలెనని, ప్రస్తుతం భారీగా కురుస్తున్న వర్షాల వల్ల టీబీపీ, ఎల్ ఎల్ సి కాల్వ నందు వరద నీరు వస్తున్నాయి. కుళాయి నీటిని త్రాగునీరుగా ఉపయోగించు ప్రజలు నీటిని వేడి చేసి వడకాచి ఉపయోగించుకోగలరని, కలుషిత ఆహారం, చల్లని ఆహార పదార్థాలు తినరాదని, ఇంటి పరిసర ప్రాంతాలలో నీరునిల్వ ఉంచకుండా, దోమలు వృద్ధి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవలెనని పట్టణ ప్రజలకు మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి తెలిపారు.

## గోస్పాడు సచివాలయం అకస్మిక తనిఖీ

నంద్యాల మా ప్రతినిధి జూలై 26 విభారె న్యూస్ :-నంద్యాల జిల్లా గొస్పాడు



మండల కేంద్రము లోని గ్రామ సచివాలయాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామున్ ఆకస్మికంగా తనిఖీ చేసి వివిధ రికార్డులను పరిశీలించారు. నంద్యాల జిల్లాలో జరుగుతున్న 5 నుండి 18 సంవత్సరాల వయసు గల పిల్లల స్థూల నమోదు నిష్పత్తి సర్వే పై వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్,వాలంటీర్ల సర్వే నమోదు ప్రక్రియను పరిశీలించారు. .

# కౌన్సిలర్ ను పరామర్శించిన వైసీపీ నాయకులు



ఎమ్మిగనూరు టౌన్ జూలై 26 విభారె న్యూస్:-అనారోగ్యంతో బాధపడుతున్న 22వ వార్డు కౌన్సిలర్ కేశవరెడ్డిని , వైసీపీ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్, టౌన్ బ్యాంక్ చైర్మన్ యూకే రాజులు పరామర్శించారు. పట్టణంలోని గాంధీ నగర్ లో ఉన్న ఆయన ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# ఆళ్లగడ్డలో 24వ కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు



అళ్లగడ్డ ప్రతినిధి జులై 26 విభారె న్యూస్ :- ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రజ్ఞ హైస్కూల్ వద్ద ఆళ్లగడ్డ ప్రైవేట్ పాఠశాల సంఘం నంద్యాల డివిజన్ అధ్యక్షులు అమీర్ భాష ఆధ్వర్యంలో 24వ కార్గిల్ విజయ్ దివాస్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కార్గిల్ లో వీరమరణం పొందిన అమరవీరుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమీర్ భాష మాట్లాడుతూ ఈరోజు కార్గిల్ విజయ్ దివస్ దేశం కోసం కార్గిల్ యుద్ధంలో పోరాడి గెలుపొంది వీరమరణం పొందిన అమరవీరులను స్మరించుకుంటూ వారికి ఘనమైన నివాళి అర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు భాష, చాంద్ బాషా, మద్దిలేటి, పి ఈ టి రాజు, స్వప్న, రాఘవి, గాయత్రి, భావన ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# పులులు వాటి ప్రాముఖ్యత గురించి వ్యాసరచన పోటీలు



ఆళ్లగడ్డ ప్రతినిధి జులై 26 విభారె న్యూస్ :- ఆళ్లగడ్డ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 29 ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా బుధవారం పులులు వాటి ప్రాముఖ్యత గురించి అటవీ శాఖ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతల సెక్షన్ ఆఫీసర్ ఎన్ శ్రీనివాసరెడ్డి, ఎఫ్ బి ఓ లు రామకృష్ణ, నాగేంద్రయ్య లు మాట్లాడుతూ నంద్యాల జిల్లా అటవీ అధికారి ఆదేశాల మేరకు రుద్రవరం అటవీ క్షేత్రాధికారి వారి ఉత్తర్వుల మేరకు ఈనెల 29వ తేదీ ప్రపంచ పులుల దినోత్సవ సందర్భంగా ఆళ్లగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణం నందు పులులు వాటి ప్రాముఖ్యత గురించి వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే పర్యావరణం కాపాడుటలో పులుల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు అవగాగాహన కల్పించడనీ జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.మురళీధర్, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి ...

**మరొకరికి గాయాలుమృతి చెందిన అంకాలు**

**మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై వెంకట్ రెడ్డి**

ఆళ్లగడ్డ ప్రతినిధి జులై 26 విభారె న్యూస్ :- ఆళ్లగడ్డ పట్టణ శివార్లలో ఉన్న శోభ ఘాట్ సమీపంలో 44వ జాతీయ రహదారిపైబుధవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళ్తే సడన్ గా హైవే పైకి వచ్చిన ఓ లారీని హైదరాబాద్ నుండి కడపకు వెళ్తున్న ఆల్విన్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆల్విన్ డ్రైవర్ పెద్ద అంకాలు అక్కడి కక్కడే చెందాడు. మరో డ్రైవర్ రమేష్ గాయాలు అయ్యాయి. ప్రమాద విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటరెడ్డి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. గాయాలైన రమేష్ ను ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# మణిపూర్ మారణకాండ కు, స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలకు బాధ్యత వహించి ఆ రాష్ట్ర సీఎం పీఎం రాజీనామా చేయాలి బీఎస్పీ డిమాండ్





పెద్దకడబూరు జూలై 26:( విభారె న్యూస్)పెద్దకడబూరు మండలంలోని కంబళదిన్నె జాలవాడి బియస్పి నాయకులు మణిపూర్ రాష్ట్రంలో గత మే నెల మూడో తారీకు నుంచి నేటి వరకు జరుగుతున్న అత్యంత దారుణ మారణకాండను గిరిజన క్రైస్తవ స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలను వెంటనే ఆపాలని చేతకాకపోతే రాజీనామా చేయాలని మణిపూర్ బిజెపి రాష్ట్ర సర్కారును బర్తరఫ్ చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంచాల లక్ష్మీనారాయణ జిల్లా ఉపాధ్యక్షులు జి.సామేలు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బోయ రవికుమార్లు డిమాండ్ చేశారు బహుజన్ సమాజ్ పార్టీ మంత్రాలయం అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు జే మోహన్ నియోజకవర్గ ఇన్చార్జి పల్లెపాడు లక్ష్మన్న యాకోబు ల ఆధ్వర్యంలో మంత్రాలయంలో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు మూడు నెలలుగా మణిపూర్ లో పాలక వర్గ మోయతి తెగ ప్రజలు అక్కడున్న కుకీ అనే గిరిజన తెగ ప్రజలపై అత్యంత దారుణ మారణకాండ కు అత్యాచారాలకు పాల్పడుతున్న మణిపూర్ రాష్ట్ర అధికార బిజెపి ప్రభుత్వం స్పందించకపోవడం దీని విషయమై ప్రధాని నరేంద్ర మోడీ గారు నామమాత్రంగా కూడా స్పందించకుండా విదేశీ పర్యటనలు చేస్తుండడం విడ్డూరమని వారు విమర్శించారు వెంటనే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బైరన్సింగ్ను భర్త రఫ్ చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు బై ఫేత్ క్రిస్టియన్లుగా ఉన్న గిరిజన కుకీ తెగలపై ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు అత్యంత దారుణాలకు పాల్పడుతున్న దీని విషయమై జాతీయ మీడియా స్పందించకపోవడం వారు ప్రధానమంత్రి విదేశీ పర్యటన కవరేజీలో తల మునుకులుగా ఉండడం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల పట్ల ఈ దేశ మీడియా నిర్లక్ష్యం బయటపడుతుందని వారు విమర్శించారు ఇకనైనా స్పందించి అక్కడ దాడులను ఆపకపోతే బహుజన్ సమాజ్ పార్టీ దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేస్తుందని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జాలవాడి మంచాల నరసన్న ఏసన్న రాజేష్ రత్నము సంసోను దినాకరు కమ్మలదిన్నె లాజరు స్వామి దాసు వరాలు ఆయా గ్రామాలనుంచి వచ్చిన బీఎస్పీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు అనంతరం మంత్రాలయం తహసిల్దార్ కు వినతి పత్రం సమర్పించారు

# అభివృద్ధి కి ఆమడ దూరం లో శిల్ప నగర్



నంద్యాల మా ప్రతినిధి జూలై 26 విభారె న్యూస్ :- నంద్యాల జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయంకు కూత వేటు దూరంలో 22 వార్డు పరిధిలో శిల్పా నగర్ ఉంది . 2008 వ సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి 900 గృహాలకు పట్టాలు పంపిణీ చేసారు. గృహాలు మంజూరు చేసినందుకు గాను ఎమ్మెల్యే పేరు మరువ కూడదని కాలనీకి ఆయన పేరే శిల్పా నగర్ అని నామకరణం చేశారు . కానీ శిల్పా మోహన్ రెడ్డి శిల్పా నగర్ కు కనీస మౌలిక వసతులు చేయలేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు . ఆయన తరువాత ఎమ్మెల్యే భూమ నాగిరెడ్డి వచ్చిన. ఇప్పుడు ఉన్న ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి కూడా ఏమియు చేయలేదని కాలనీ వాసులు విమర్శిస్తున్నారు .. రోడ్డు. కాలువల కోసం రాజకీయ నాయకుల చుట్టూ తిరిగి తిరిగి అలసి పోయామన్నారు . కనీసం కలెక్టర్ గారి దృష్టికైనా తీసుకెళ్లే న్యాయం జరుగుతుందని భావించి సోమవారం జగనన్న కు చెబుతాం స్పందన కార్యక్రమం లో సంతకాల సేకరణ తో కూడిన వినతిపత్రం కలెక్టర్ గారికి అందజేశామని అన్నారు. శిల్పా నగర్ హైవేకు ఆనుకొని ఉంది . దాదాపు 4000 జనాభా నివసిస్తున్నారు . శిల్పానగర్లో రోడ్లు లేక వర్షాలు పడినపుడు గుంతలమయమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు . రోడ్లలో నీరు నిల్వ వుండి రోడ్డు కనపడక నడవలేని పరిస్థితిలో ఉన్నారు. కాలువలు సరిగా లేకపోవటం వలన మురికి నీరంతా రోడ్లపై ప్రవహిస్తున్నది. దోమలతో ప్రజలకు విషజ్వరాలు, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాపిస్తున్నాయి. గత సంవత్సరం క్రితం ఇద్దరు మనుష్యులు పాము కాటుకు గురై మరణించారు.. గుంతలు అధికంగా ఉన్న చోట చందాలు వేసుకొని పూడ్చాము . కలెక్టర్ గారు మా కాలనీకి కనీస మౌలిక వసతులు కల్పిస్తారని ఆశతో ఉన్నామన్నారు.

# ఉపాధ్యాయులు లేని ప్రభుత్వ పాఠశాల.

**- పాఠశాల ముందు ఏఐఎస్ఎఫ్, పి.డి.ఎస్.యుల ధర్నా.**

ఎమ్మిగనూరు జూలై 26 విభారె న్యూస్.మండలం లోని గార్లదిన్నె గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు లేకుండా విద్యార్థులు చదువులు ఎలా చదువుకుంటారని పి.డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర బాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు.బుధవారం స్థానిక గార్లదిన్నె గ్రామంలో పాఠశాల ముందు విద్యార్థిని,విద్యార్థి తల్లిదండ్రులతొ కలిసి ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ నాడు - నేడు పథకం ద్వారా ప్రభుత్వం పాఠశాలలను కార్పొరేట్ దిటుగా అభివృద్ధి చేస్తానని ఎన్నో గొప్పలు చెప్తున్నా వ్యక్తి ఈ రోజు విద్యార్థులు చదువుటకు గదులు లేక పాఠశాల వరండాల్లో చదువే పరిస్థితి ఉందన్నారు.అలాగే ఆ పాఠశాలకు వంట గది లేక తరగతి గదిలో వంట చేసే దుస్థితి ఉందన్నారు.అదేవిదంగా పాఠశాలలో 90 మంది విద్యార్థులు గాను ఒక్క ఉపాధ్యాయుడు లేకపోవడంసిగ్గుచేటన్నారు.అలాగే ఉపాధ్యాయులు,తరగతి గదులు లేక విద్యార్థులు చదువులు మధ్యలోనే ఆపేసారని వారు అన్నారు.కావున రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యార్థులకు సరిపడ ఉపాధ్యాయులను,తరగతి గది ఏర్పాటు చేయాలి లేనిపక్షం లో విద్యార్థులతో కలిసి ఎంఆర్ఓ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో ఏఐటియుసి తాలూకా కార్యదర్శి తిమ్మాగురుడు,రవి, చిన్న, మహేష్, బాషా, తదితరులు పాల్గొన్నారు.




# ఈనెల 28 నుండి వచ్చే నెల 12 వరకు శ్రీ మహా గౌరీ అమ్మవారికి విశేష పూజలు.

కర్నూలు జూలై 26 విభారె న్యూస్.పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ మరియూ శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామిజీ వారల దివ్య ఆశీస్సులతో శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో అధిక శ్రావణమాసం సందర్భంగా 28.07.2023 దశమి శుక్రవారం నుండి 12.08.2023 ఏకాదశి శనివారం పర్యంతము శ్రీ మహాగౌరీ పరదేవతా సన్నిధిలో శ్రీ లలితా సహస్రనామ పారాయణ పూర్వక కోటి కుంకుమార్చన మహా యజ్ఞం చేయుట సంకల్పించబడినది. ఈ (షోడశ దిన పర్యంతం) 16 రోజులు ఉదయం 10 గం నుండి 12 గం ల వరకు, తిరిగి సాయంత్రం 6 గం నుండి 8 గం వరకు పారాయణ, అర్చన కార్యక్రమము నిర్వహించబడును. ఈ అధిక మాసంలో చేసే జప, తప పారాయణ, అర్చన, హోమాలు, అత్యంత శుభఫలములు ఇవ్వగలవు. శ్రీ లలితా పరాభట్టారిక అనుగ్రహం కొరకు శ్రీ లలితా పరదేవతా ప్రీత్యర్థం లోక కళ్యాణం కొరకు నిర్వహించే కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులగుదురని కోరుచున్నాము. వివరములకు డి.లక్ష్మీనరసింహ శర్మ 8008774086.

## ఆగస్టు 1న పౌర్ణమి సందర్భంగా శ్రీ సూర్య దేవాలయంలో ధన్వంతరి సహిత అరుణ హోమం.


కర్నూలు జూలై 26 విభారె న్యూస్.01-08-2023 చాతుర్మాస వ్రతం లో భాగంగా అధిక శ్రావణ మాస మంగళవార ప్రయుక్త పౌర్ణమి సందర్భంగా సంపూర్ణ ఆరోగ్యము పితృదేవతల అనుగ్రహము కొరకు అనారోగ్య సమస్యల నివారణ కొరకు శ్రీ ధన్వంతరి సహిత అరుణ హోమం జరుగును. సమయము ఉదయం 10:30 గంటలకు.(ప్రధానముగా) ధన్వంతరి,అరుణ హోమ రుసుము -3500సంకల్పం -116వివరాలకు సంప్రదించగలరు.వినయ్ కుమార్ శర్మ కృష్ణ యజుర్వేద క్రమాంత స్వాధ్యాయి.8919594919 దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు:8896123777.

# రాయలసీమకు జరుగుతున్న అన్యాయాన్ని ఢిల్లీ లో ప్రశ్నిద్దాం



నంద్యాల మా ప్రతినిధి జూలై 26 విభారె న్యూస్ :-రాయలసీమకు రావాల్సిన నీళ్ళు,నిధులు,నియామకాలలో సమాన వాటా కోసం, రాయలసీమకు జరుగుతున్న అన్యాయాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు, రాయలసీమ ప్రాంత అభివృద్ధే ఏకైక లక్ష్యముగా రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగిందని రాయలసీమ స్టీరింగ్ కమిటీ నంద్యాల జిల్లా నాయకులు యం. వి. రమణారెడ్డి అన్నారు.బుధవారం నంద్యాల నుండి వందలాది మంది రైతులు, యువకులు, విద్యార్థులు భారీ వర్షాలును లెక్కచేయకుండా స్వచ్ఛందంగా బైరెడ్డి ఏర్పాటు చేసిన ప్రత్యేక రైళ్లలో ఛలో ఢిల్లీ కి తరలివెళ్లారు.ఛలో ఢిల్లీ కి నంద్యాల నుండి కదిలిన నాయకులు కాశీపురం ప్రభాకర్ రెడ్డి, గొల్ల చిన్న నారాయణ, భాస్కర్, డాక్టర్ రామిరెడ్డి, సీమ రామిరెడ్డి, ఆళ్లగడ్డ రమేష్, కరిమద్దేల ఈశ్వర్ రెడ్డి, నరసింహ యాదవ్, లక్ష్మి రెడ్డి, తదితరులు ఉన్నారు.

# స్వాతి నక్షత్రం శ్రీ మద్దులేటి లక్ష్మీ నృసింహా స్వామి కి విశేష పూజలు



నంద్యాల మా ప్రతినిధి జూలై 26 విభారె న్యూస్ :- నంద్యాల పట్టణంలో తెలుగు పేట యందు వెలసిన శ్రీ మద్దులేటి లక్ష్మీ నృసింహా దేవస్థానం యందు బుధవారం జన్మ నక్షత్రం. స్వాతి నక్షత్రం. పర్వదినాన పురస్కరించుకుని ఆలయం లో ఉదయం అర్చకులు స్వామి వార్ల కు పంచామృత అభిషేకం మరియు స్నపన తిరుమంజన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం స్వాతి నక్షత్రం రోజున అభిషేకం కు సహకరించిన దాతలతో మరియు భక్తుల చే స్వామి వారి ఉత్సవ మూర్తికి సాముహిక అభిషేకాలు నిర్వహించారు . స్వామి వారి అభిషేకం తదుపరి స్వామి వార్ల ను వస్త్రాలు, పూలమాలలు తో అలంకరించి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి ఇచ్చారు . ఈ కార్యక్రమంలో అభిషేకం కి సహకరించిన దాతలు మరియు భక్తులు పాల్గొని స్వామి వారి మహా మంగళహారతి మరియు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు . సహకరించిన దాతలకు కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190